# మగవాళ్ళకు మాత్రమే!

రచన:
శ్రీ భీశెట్టి రామకృష్ణ.

"ఒరే కుమార్ నేన్చెప్పింది ఏం చేశావురా" అంటూ లోనికి వచ్చాడు ప్రసాద్.

వీడి అవతారము చూసేసరికి నాకు మతిపోయింది. కారణము నవనాగరికతను విమర్శించే ప్రబద్ధులలో మొదటోరకము. అలాంటిది ఈరోజు డిస్కో డ్రెస్ వేశాడు. కారణం ప్రేమమైకము.

'ఆఁ, రాశానురా! ఇదిగో అంటూ అల్మారాలోనిది ఒక కాగితముతీసి ఇచ్చాను. ప్రసాద్ విప్పి చదవటం మొదలు పెట్టాడు.

'ప్రేమలేఖ వ్రాసి ఛాఁదెబ్బ తినక
అబలవెంట తిరిగి అలిసిపోక
తరుణి ఛీదరించినదని తల్లడిల్లి
ఆత్మహత్య బూని అలుసుకోకు.'

'ఇదేం పద్యంరా బాబు. నీవేదో బి. ఏ. లిటరేచర్ వెలగబెడుతున్నావు కదాని లవర్‌మీద పద్యం రాయరా అంటే నాకు మర్మంగా హితబోధ చేస్తున్నావన్నమాట' అన్నాడు ప్రసాద్.

'పసాద్ టైమ్‌లేక రాయలేకపోయానురా. ఇది నేను P. U. C. చదివేరోజులలో రాసినది. సర్దాకి నీకు ఇచ్చాను. రాత్రికి తప్పక రాసిస్తానురా' అన్నాడు.

'నేనెళ్ళొస్తానురా కుమార్, గీత సినిమా ప్రోగ్రాము వేసింది by by' అంటూ వెళ్ళిపోయాడు ప్రసాద్.

*　　*　　*

ఈరోజుల్లో ప్రతివాడికి తప్పనిసరిగా ప్రేమ ఉంటుంది. నాలాంటి ఏరచయితకో లేకపోతే లెక్కా. అయినా ఈవేళ 'పద్మ'ని ఏవిషయము అడిగేయాలి అనుకుంటూ అల్మారాలో పుస్తకాలు సర్దుతుంటే, ఒక కాగితము రాలింది. ఏమిటి చూద్దామని విప్పేసరికి నెలరోజులక్రితము రాసిన పద్యమది.

'పగలురేయి అనక నేను పద్మకొఱకు
నిదుర ఆహారములులేక కుదురులేక
తిరిగి చేరితి చెలియను తేజమొప్ప
పరిణయము చేసుకొందును పట్టుదలతో.'

పద్మ పేరనేసరికి నామనసులో గిలిగింతలు పెట్టినట్టు అయింది. దానికి కారణం పద్మరూపం నా అణువణువ నిండిఉంది. పద్మ లేకపోతే బహుశ జీవించనేమో. పద్మది లక్షణమైన రూపము. విశాలమైన కళ్ళు, ధళధళ మెరిసే పళ్ళు, జిగేలుమనే వొళ్ళు. ఆమెది ప్రత్యేకమైన తరహా.

అసలు ఆమె పరిచయంకూడ విచిత్రంగానే జరిగింది. నేను ఈ అనకాపల్లికి 15 మైళ్ళదూరంలోవున్న యలమించిలిలో P. U. C. పాసయ్యి, ఇక్కడ A M.A.L. కాలేజిలో తెలుగు లిటరేచర్‌లో బి. ఏ. లో చేరాను. ఆరోజుల్లోనే పద్మ B.Sc. లో చేరింది.

ఒకరోజు సత్యనారాయణమూర్తి గుడికి బైలుదేరాను. సాయంకాలంపూట విద్వాన్ విశ్వంగారిది 'నా హృదయం' పుస్తకము పట్టుకొని. నేను పైకి వెళ్ళేసరికి ఇద్దరమ్మాయిలు కూర్చొని మాట్లాడుకుంటున్నారు. వాళ్ళు వుండేచోట నేను వుంటే బాగోదని వెనక్కి తిరిగాను.

'ఏవండి కుమార్‌గారు వెళ్ళిపోతున్నారు ఏమిటి?' అంది ఇద్దరిలో ఒకామె.

'అబ్బే, ఏమిలేదండి. సర్దాగా అలా వచ్చాను' అన్నాను. వాళ్ళను ఎక్కడో చూచినట్లు జ్ఞాపకంవస్తే ఆలోచిస్తూ.

'మీ ఆలోచన ఏమిటో నాకు తెలుసండి కుమార్‌గారు. నేను చెపుతాను వినండి. ఆమధ్యన బాలానంద సంఘం వారు ఏర్పాటుచేసిన సమ్మేళనంలో మీరు కవిత చదివారు. అపుడు మీకు దగ్గర్లోనే ఉన్నాను. మీ పేరు, మీ ప్రతిభ ఆనాడే తెలిసాయి. ఇంక మాపేర్లు వినండి. ఈమె ఇందిర. నాపేరు పద్మ. బోటనిమేన్. మా నివాసము అనకాపల్లి లక్ష్మీదేవిపేట. ఇది చాలా, ఇంకా వివరాలు . . . . అంది పద్మ.

'వద్దులెండి' అన్నాను. ఒకవైపు ఆమె తెలివితేటలను అంచనావేస్తూ.

'మేము వస్తామండి కుమార్‌గారు. అప్పుడప్పుడు ఇటు రండి, మీలాంటి కవీశ్వర్లు చెంతనవుంటే సహవాసదోషం వల్ల, నాలుగు నవలలన్నా రాశేయవచ్చు. అసలే ఈరోజుల్లో సాహితీరంగాన ఆడదాని పేరుకున్న విలువ కళాప్రపూర్ణ నంపాదించుకున్న మగవారుకు లేదు. కాదంటారా?' అంది నవ్వుతూ పద్మ. సభ్యతకు నేనూ నవ్వాను. వస్తానండి అని చెప్పి వెళ్ళిపోయారిద్దరు నవ్వుకుంటూ.

వారు వెళ్లినతరువాత చాలసేపు పద్మగూర్చే ఆలోచనలు చుట్టుముట్టాయి. పరాయి వ్యక్తులయెదుట సిగ్గుపడే అమ్మాయిలకు మనోధైర్య ముండదు. కానీ పద్మ అలాంటిది కాదు. ఆనాటిపరిచయము కాలక్రమేణ సాహిత్య గోష్టులు, షికార్లు, సినిమాలు, పిక్నిక్‌లవరకు విస్తరించింది. కాని, అసభ్యకరమైన పదజాలంగాని, చేష్టలుగాని మా ఇద్దరిమధ్య లేవు. ఇన్నాళ్ళు మా స్నేహం నిలబడడానికి కారణం ఇవేననే నా నమ్మకం.

ప్రస్తుతానికి రెండు సంవత్సరములుగడిచి మూడో సంవత్సరము నడుస్తుంది. ఈవేళ పద్మసంగతి తేల్చుకోవాలని బయలుదేరాను.

సమయం 4 గంటలైంది. రోడ్లమీద జనం ఓమాదిరిగా ఉన్నారు. నేను వుండేది గవరపాలెము. అక్కడ నుండి సరాసరి 'రాజా' థియేటర్ దగ్గిరకువెళ్లి సిగరెట్ పెట్టె కొని సిగరెట్టు ముట్టించాను. ఇక్కడనుండి కళింకోట వెళ్ళేసమయానికి చీకటి పడేటట్టువుందని సైకిల్ అద్దెకు తీసుకొని ఎక్కాను.

సగందారిలోకి వెళ్ళేసరికి తెలుగు లెక్చరర్ కనిపించారు. గౌరవసూచకంగా సైకిల్‌దిగి నమస్కారము పెట్టాను. సిగరెట్ ప్రక్కకు విసిరేసి.

'ఏవోయి కుమార్, ఎందాక బయలుదేరావు' అనడిగారు లెక్చరర్.

'కాలేజిదగ్గిరకని' చెప్పాను.

'అయితే కుమార్ ఈలెటర్ లేబరేటరిదగ్గిర ప్యూన్ ఉంటాడు. వాడిచేతికిచ్చి బోటని లెక్చరర్‌కు ఇమ్మని చెప్పు' అన్నారు లెక్చరర్.

'అలాగేసార్' అనిచెప్పి కొంతదూరం నడిచి సైకిలెక్కాను. ఎక్కిన సైకిల్ సరాసరి కాలేజి గేటుదగ్గిర ఆపి లేబరేటరిలోకి వెళ్ళాను. లోపల ఎవరూ లేరు. కాలేజి ఆవరణలో జనసంచారం లేదు. ఒకరిద్దరు హాస్టల్ స్టూడెంట్సు అటు ఇటు తిరుగాడుతున్నారు. గార్డెన్‌లోకి వెళ్ళేడేమో అని వెళ్ళాను. నేను అనుకున్న ప్యూన్ లేదు కాని, పద్మ మరియొక యువకుడు మాట్లాడుకోవటము నాకంట పడింది. నాకు చిర్రెత్తుకొచ్చింది. ఎవరితోపడితే వారితో మాట్లాడటమే. సిగ్గులేకపోతే సరి. అని మనసులో అనుకొని, వారికంట పడకుండా వారిమాటలు విందామని పక్కన నక్కాను.'

'రంజిత్‌కుమార్ మన మేరేజ్‌కు ఎటువంటి ఏర్పాట్లు చేస్తే బాగుంటాయో ఆలోచించు. లేకపోతే నా ఫ్రెండ్స్ ఉడికిస్తారు బాబు' అంటుంది పద్మ గోముగా.

రంజిత్‌కుమార్ 'అలాగే డియర్' అంటున్నాడు నవ్వుతూ.

నాకు ఆకాశం తిరుగుతున్నట్టు, భూమి పగులుతున్నట్టు, జీవనదులు ఎండిపోయినట్టు అనిపించింది ఓ పావుగంట.

అసలు నాకూ రంజిత్‌కుమార్‌కూ తేడా ఏమిటి? వాడికి కుమార్ ముందు రంజిత్ ఉంది. నాకు లేదు అంతేనా.

అది అవసరమంటే__

''జయమాలిని కుమార్'' అనో,
జ్యోతిలక్ష్మి కుమార్ అనో
స్మితా కుమార్ అనో
పెట్టుకుందునో''

అసలు పద్మకు నేనంటే అయిష్టతా? నాతో ఎందుకు అంత చనువుగా మసిలింది? నాలో ఆశ లెందుకు రేపింది? కళ్ళుమూసుకొని ఆలోచిస్తున్న నాకు చప్పున భర్తృహరి పద్యము గుర్తొచ్చింది,

''ఒకనితోగూడి భాషింతు రొక్క నరుని
జూతురు విలాస సంపద సొంపుగులక
మఱియు నొక్కని దలంతురు మనసులోన
గూర్చి ప్రియుడెవ్వడో ముద్దుగుమ్మలకును.''
అని.

Edited and Published by A. N. Raghavachar, No. 10, Murugesa Mudali St., Madras-600 079
Printed by G. Kulasekaram at Giridhar Art Printers, 47, Badrian Street, Madras-600 001,